రూ. 22లక్షలకు మేకల మండి వేలం

మంచిర్యాలటౌన్, మార్చి 16: మంచిర్యాల మున్సిపాలిటీలో మేకల మండి కోసం నిర్వహించిన వేలంపాటలో రూ. 22 లక్షలకు పాటపాడి దక్కించుకున్నారు. పట్టణంలో మేకల మండి నిర్వహణకోసం శనివారం నిర్వహించిన వేలం పాటలో నలుగురు గుత్తేదార్లు పాల్గొనగా అందులో బొంబత్తుల శంకర్ రూ. 22 లక్షలకు వేలంపాట పాడి మేకలమండిని దక్కించుకున్నారు. వాటర్ ట్యాంకు దగ్గర ఉన్న దుకాణాల్లో తొమ్మిదో నంబర్ షాప్‌నకు నిర్వహించిన వేలం పాటలో ఇద్దరు వ్యక్తులు పాల్గొనగా రూ. 10, 700 కిరాయికి ఎండీ ఇబ్రహీం దక్కించుకున్నారు. ఈ వేలంపాట మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, కమిషనర్ మారుతీప్రసాద్, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

కోటపల్లి, మార్చి 16 : కుక్కల దాడిలో గాయపడిన చుక్కల దుప్పి చికిత్స పొందుతూ మృతిచెందింది. కోటపల్లి మండలం మల్లంపేటలోని అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పి రాగా, కుక్కలు వెంబడించి గాయపరిచాయి. గ్రామస్తులు కాపాడి వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. వైద్యం కోసం అటవీ అధికారులు, గ్రామస్తులకు పశువైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించింది. మరణించిన దుప్పికి పంచనామా నిర్వహించిన అటవీ అధికారులు ఖననం చేశారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

బెల్లంపల్లిరూరల్, మార్చి 16: లోక్ అదాలత్ ను పురస్కరించుకొని బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం న్యాయవాదులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని జూనియర్ సివిల్ జడ్జి ముఖేశ్ ప్రారంభించారు. సివిల్ జడ్జి ముఖేశ్,తాండూర్ సీఐ కుమారస్వామి లతో పాటు ముప్పై మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ బొప్పు సతీశ్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, సురభి శరత్‌కుమార్, కే సంతోష్ కుమార్,బెల్లంపల్లి రెడ్‌క్రాస్ సబ్ డివిజన్ సభ్యులు సూరం లక్ష్మీనారాయణ, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్‌కుమార్ , బార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5.
NT-327958-All
ఉచిత శిక్షణ-ఉపాధి
★Solar, 5G, Drone, Hardware లతో పాటు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించబడును. Cont: PMKK, కోటక్ మహింద్ర బ్యాంక్ ఎదురుగా, మంచిర్యాల. సెల్: 7095780999, 7095906999, 7095807999.
NTK-311116
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
బెల్లంపల్లి: 91827 77671, 91827 77677

బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్రతోనే కవిత అరెస్ట్

- కేంద్ర సర్కారుపై వెల్లువెత్తిన నిరసనలు
- పలు చోట్ల రాస్తారోకోలు, ధర్నాలు, దిష్టిబొమ్మ దహనాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మంచిర్యాల టౌన్ : రాస్తారోకో విరమించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావును కోరుతున్న పోలీసులు

రామకృష్ణాపూర్ : రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్, మార్చి 16: ఎమ్మెల్సీ కవిత అరెస్టు ముమ్మాటికీ బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్రేనని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో కవిత అరెస్టును నిరసిస్తూ బబీ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ప్రతిపక్షాల నాయకులను అరెస్టులు చేయించడం, ఎంతోమందిపైకి ఈడీ అధికారులను పంపడం, కేసులను పెట్టించడం, జైళ్లలోకి పంపడం చేస్తున్నారని అన్నారు. తిరిగి వారు బీజేపీలో కలిస్తే కేసులన్నీ ఉపసంహరణ చేసి క్లీన్‌చిట్ ఇస్తున్నారని అన్నారు. కవితను అరెస్ట్ చేస్తారని బీజేపీ నాయకులు చాలాసార్లు మాట్లాడిన సందర్భాలు ఉన్నాయని, అధికారులకన్నా ముందు వాళ్లకు ఎలా తెలిశాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉండగా సోదాల పేరిట హైదరాబాద్‌కు వచ్చిన ఈడీ అధికారులు సాయంత్రం వరకు తనిఖీలు చేసి చివరకు అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించారని, రాత్రి విమానం టికెట్ కూడా బుక్ చేశారంటే ముందస్తు ప్లాన్‌తోనే చేశారని, బీజేపీ కుట్రకోణంలో భాగమే అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కూడా కవిత అరెస్ట్ అవుతుందని పలుమారు చెప్పారని అన్నారు. దీన్నిబట్టి చూస్తే బీజేపీ, కాంగ్రెస్‌ల నాటకం బయటపడిందని అన్నారు. ప్రధాని మోదీ తక్షణమే బేషరతుగా కవితను విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. 10 ఏళ్లు కేసీఆర్ అధికారంలో ఉన్నా ఎక్కడా ఇలాంటి అరెస్టులు జరుగలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాదెసత్యం, గోగుల రవీందర్‌రెడ్డి, ఎర్రం తిరుపతి, మధూకర్, శ్రీపతి వాసు, సుబ్బయ్య, మొగిలి శ్రీనివాస్, తాజుద్దీన్, సుంకరి రమేశ్, మందపల్లి శ్రీనివాస్, గట్టయ్య, బింగి ప్రవీణ్, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రతోనే అరెస్ట్ : మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి, మార్చి 16 : రాజకీయ కుట్రతోనే కవితను అక్రమంగా కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేయించిందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్, భారత జాగృతి శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. కేంద్రప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కవితక్కను బేషరతుగా విడుదల చేయాలని నినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ పదేండ్లలో అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షపార్టీ నేతలకు నోటీసులు ఇవ్వడం, వారు బీజేపీలో చేరగానే వాటిని రద్దు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కోర్టు సుప్రీంకోర్టులో ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ దృష్టిలో ఉంచుకుని అరెస్టు చేయడంపై ఆయన మండి పడ్డారు.తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడిన మహోన్నత వ్యక్తి కవిత అని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు. తెలంగాణ ప్రజలు రాబోయే కాలంలో వీరు చేస్తున్న దుశ్చర్యలకు దీటుగా సమాధానం చెబుతారని హెచ్చరించారు. కవితక్కను బేషరతుగా విడుదల చేయకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య సీనియర్ నాయకులు, నియోజకవర్గ జాగృతి నాయకులు,కార్యకర్తలు, మున్సిపల్ పట్టణ సీనియర్ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, ఎస్ఐలు రమేశ్, నరేశ్ బందోబస్తు నిర్వహించారు.

కక్షసాధింపులో భాగమే..

చెన్నూర్, మార్చి 16: రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై వికృత రాజకీయాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ చెన్నూర్‌లో బీఆర్ఎస్ నాయకులు శనివారం ధర్నా చేసి, తెలంగాణ విగ్రహం చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతె తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, దోమకొండ అనిల్, జగన్నాథుల శ్రీను, కిష్టంపేట ఎంపీటీసీ నాగవత్ శ్రీను, కోటపల్లి సింగల్ విండో చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, పెండ్యాల లక్ష్మణ్, నెన్నెల భీమయ్య, రాసపాక శ్రీశైలం, ఆరీఫ్, మేడ సురేశ్‌రెడ్డి, రత్న సమ్మిరెడ్డి, కొప్పుల రవి, నయాబ్, బుర్ర రాకేశ్‌గౌడ్, ముత్యాల సత్యవతి, భారతి, తిరుపతి సురేశ్, రేవెల్లి రాజు, సుద్దాల ప్రశాంత్, కమటం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

మందమర్రి, మార్చి 16: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ మందమర్రి పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. మార్కెట్ సమీపంలోని సింగరేణి పాఠశాల వద్ద కోల్‌బెల్ట్ రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించిన, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే. రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు బడికెల సంపత్, బండారు సూరిబాబు, కొంగల తిరుపతి రెడ్డి, ఎండీ అబ్బాస్, ఈశ్వర్, మద్ది శంకర్, బోరిగం వెంకటేశ్, కనకం రవీందర్, భట్టు రాజ్‌కుమార్, ఎండీ ముస్తఫా, సోషల్ మీడియా ఇన్‌చార్జి సీపెల్లి సాగర్ తదితరులున్నారు.

రామకృష్ణాపూర్‌లో..

రామకృష్ణాపూర్, మార్చి 16: బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై క్యాతనపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం గద్దెరాగడిలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కవితను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, సీనియర్ నాయకుడు డా. రాజారమేశ్‌బాబు, రామిడి కుమార్, గోపు రాజం, అలుగుల సత్తయ్య, కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, పారిపెల్లి తిరుపతి, అనిల్ రావు, యువత నాయకులు చంద్రకిరణ్, రామిడి లక్ష్మీకాంత్, మణి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య

మంచిర్యాల అర్బన్, మార్చి 16 : ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో యాదయ్య వెల్లడించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, సెవెన్ హిల్స్ స్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను డీసీజీఈ దామోదర్‌తో కలిసి పరిశీలించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులను ఉదయం 9.35 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 9,298(4,790 బాలురు, 4,508 బాలికలు) మంది రెగ్యూలర్ విద్యార్థులు, 339 మంది గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. పది పరీక్షల కోసం 52 పరీక్షా కేంద్రాలను కేటాయించామని, అన్ని పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.ఏవైనా సందేహాలుంటే కంట్రోల్ రూం(7032463114)ను లేదా 9440688034ల్లో నివృత్తి చేసుకోవచ్చన్నారు. సాయంత్రం కలెక్టర్ పరీక్షల నిర్వహణపై జూమ్ సమావేశం ద్వారా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

- అధికారులకు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆదేశం

నస్పూర్, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికల కార్యచరణ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ అన్నారు. శనివారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికలప్రధాన కమిషనర్ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీలు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, ఫొటోలు, వాల్ రైటింగ్స్, పోస్టర్లను, బ్యానర్లు తొలగించాలని ఆదేశించారు. ఏప్రిల్ 18న లోక్‌సభ ఎన్నికల సంబంధిత గెజిట్ నోటిఫికేషన్‌విడుదల అవుతుందని అప్పటి వరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, కంట్రోల్ రూంలు ఏర్పాటు, మీడియా సెంటర్ ఏర్పాటు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ తదితర కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. నామినేషన్‌ల దాఖలుకు ఏప్రిల్ 25 ఆఖరు తేదీ అని, 26న నామినేషన్‌ల పరిశీలన, 29న నామినేషన్‌ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని , జూన్ 6 వరకు ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల కార్యాచరణ వచ్చినందున జిల్లాలో ఎన్నికల నియామవళి అమలుకు అన్ని శాఖల అధికారులతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో రాములు, ఎల్ఏ ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళ, డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అత్యవసర సమావేశాలు

లోక్ సభ ఎన్నికల కార్యాచరణ విడుదలైనందున పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో గల జల్లాలో ఎన్నికల నిర్వహణ సంబంధిత అంశాలపై ఈ నెల 17న అధికారులతో కలెక్టరేట్‌లో అత్యవసర సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అదికారి, జిలా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో 11 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో, మధ్యాహ్నం 12 గంటలకు పాత్రికేయులతో సమావేశాలుంటాయని తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమం రద్దు

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి కొనసాగుతుందని తెలిపారు.

కార్యాలయాలకి స్థలం కేటాయించాలని వినతి

హాజీపూర్, మార్చి 16 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘ భవనాల నిర్మాణాల కోసం బెల్లంపల్లి, కన్నెపల్లి మండలాల్లో నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతి టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి వినతి పత్రాన్ని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షుడు రామ్‌కుమార్, తిరుపతి, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, సందీప్, కుమార స్వామి, తిరుమల్ తదితరులున్నారు.

చైతన్యలో ఓపెన్ హౌస్ యాక్టివిటీ

మంచిర్యాల అర్బన్, మార్చి 16 : పట్టణంలోని లక్ష్మీనగర్ శ్రీ చైతన్య బ్రాంచ్‌లో అకాడమిక్ ఫెయిన్ ఓపెన్ హౌస్ యాక్టివిటీని శనివారం ఏర్పాటు చేశారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులందరూ ఓపెన్ హౌస్ యాక్టివిటీ ద్వారా ఈ విద్యా సంవత్సరం పాఠ్యాంశాలను ప్రదర్శించారు. శరీర భాగాలు, సిగ్నల్ లైట్ వ్యవస్థ, మొక్కల భాగాలు, జాతీయ చిహ్నాలు తదితరాలను ప్రదర్శించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆయూబ్, ప్రీ ప్రైమరీ ఇంఛార్జీ కృష్ణవేణి, కో ఆర్డినేటర్ రోజారాణి, ఏజీఎం రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

మంచిర్యాల అర్బన్, మార్చి 16 : గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అంగన్ వాడీ టీచర్ మాధవి అన్నారు. పోషణ్ పక్వాడలో భాగంగా శని వారం అశోక్ రోడ్ సెక్టార్ రాజీవ్ నగర్ 2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన, 30 నెలలు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఫర్జానాబేగం, తల్లులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేల సామగ్రి విరాళం

దండేపల్లి, మార్చి16: దండేపల్లి మండలంలోని కన్నేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల కోసం రూ.10 వేల విలువైన కుర్చీలు, బెంచీలు, ఆట వస్తువుల అంగన్‌వాడీ కేంద్రానికి అక్కల సుధాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇండ్ల స్వరూప, నాయకులు బందెల రవిగౌడ్, చుంచు నగేశ్, ముల్లె మల్లేశ్, చంద్రయ్య, కిషన్ ఉన్నారు.

జంతు పక్షాదులకు పండ్లు, నీరు అందజేత

జైపూర్, మార్చి 16: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) ఆధ్వర్యంలో శనివారం జైపూర్ అటవీలోని మల్లికార్జున ఆలయం సమీపంలో జాతీయ రహదారి వద్ద కోతులు, పక్షులకు పండ్లు, నీరు, చిరుధాన్యాలు పంపిణీ చేశారు. ఏబీఏపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, ప్రధాన కార్యదర్శి ఎల్క సంతోష్, ఉపాధ్యక్షుడు ఒడ్నాల రవీందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు పాల్గొన్నారు. నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏబీఏపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు కే శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి నగునూరి శ్రీనివాస్, పీఆర్ఏ భాస్కర్ల రాజేశం, సబ్బులు వెల్మరెడ్డి శివారెడ్డి, సాయికిరణ్, రమేశ్, బేతి సత్యనారాయణ, సిరిపురం రాజేశం పాల్గొన్నారు.

'108'లో ప్రసవం

కన్నెపల్లి, మార్చి 16:మంచిర్యాల జిల్లా భీమిని మండలం అక్కలపల్లికి చెందిన గర్భిణి రెడ్డి మహేశ్వరికి తీవ్రమైన పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకురలించారు. రాంపూర్ గ్రామ సమీపంలోకి రాగానే నొప్పులు తీవ్రమవడంతో ఈఎంటీ సాహిర్ పాషా 108 ప్రధాన కార్యాలయంలో వైద్యుల సూచనలు పాటిస్తూ వైద్యం అందించగా మహేశ్వరీ మగ బిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే వారిని బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ సాహిర్ పాషా, పైలట్ ఖలీల్ అహ్మద్ తెలిపారు.

జన్నారం ఎస్ఐగా రాజవర్ధన్

జన్నారం, మార్చి 16 : మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా రాజవర్ధన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన పీ సతీశ్‌ను రామగుండం సీపీ కార్యాలయానికి అటాచ్ అయ్యారు.

సీవోఈ వార్షికోత్సవం

బెల్లంపల్లిరూరల్, మార్చి 16: బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్స్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎంఈవో పీ మహేశ్వర్‌రెడ్డితో పాటు గురుకులాల ప్రిన్సిపాళ్లు, బెల్లంపల్లి సీవోఈ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులున్నారు.

సెల్ టవర్ ఎక్కి నిరసన

జైపూర్, మార్చి 16: పీఎఫ్ డబ్బులు రావడం లేదని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎస్టీపీపీ)లో ఒప్పంద కార్మికుడు మధు శనివారం జైపూర్ బస్తాండు సమీపంలోని సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. తన ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతా నుంచి సొమ్ము విత్ డ్రా చేసుకుంటే, రావడం లేదని, అసహనంతో. సెల్ టవర్ ఎక్కాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంబంధిత కంపెనీ యాజమాన్యానికి విషయం తెలపడంతో వారు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కిందకు వచ్చాడు. దీనిపై స్పందించిన హెచ్ఎంఎస్ నాయకులు సంపత్, సాయికృష్ణ కార్మికుడి సమస్యను పరిష్కరించాలని సంబందిత యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఆటో దొంగల అరెస్ట్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 16: ఆటోలు దొంగతనం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల సీఐ బన్సీలాల్ తెలిపారు. శనివారం మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం భగవంతంవాడ ఏరియాలో పార్కింగ్ చేసి ఉన్న ఆటో చోరీకి గురవడంతో వెంటనే పోలీసులకు మంద శ్రావణ్ ఫిర్యాదు చేశాడు. మూడు రోజుల క్రితం కలర్స్ ల్యాబ్ వద్ద (టీఎస్ 19 టీఏ 7758) మరో ఆటో మిస్సైనట్లు ఫిర్యాదు వచ్చింది. ఈ కేసుల దర్యాప్తులో భాగంగా శనివారం సాయంత్రం మంచిర్యాలలోని రేల్వేస్టేషన్ సమీపంలో ఎస్ఐలు మహేందర్, లక్ష్మణ్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. మంచిర్యాల అశోక్‌రోడ్డుకు చెందిన అనుముల శ్రీధర్, సప్తగిరి కాలనీకి చెందిన వెంగల శ్యాంకుమార్ ఆటో తీసుకొని ఓవర్‌బ్రిడ్జి వైపు వెళ్తుండగా వారిని ఆపి ఆటో పత్రాలు చూపించమని అడుగగా చూపలేదు. వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆటోలను చోరీ చేసినట్లు అంగీకరించారు. గతంలోనూ రెండు ఆటో చోరీ చేసినట్లు అంగీకరించారు. వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. 24గంటల్లో కేసును ఛేదించిన ఎస్ఐలు, సిబ్బందిని సీఐ అభినందించారు.

రాజీ మార్గమే రాజమార్గం

- లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్

లక్షెట్టిపేట, మార్చి 16: రాజీ మార్గమే రాజమార్గం అని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. పట్టణ న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన ము